## క్లుప్తంగా

### గుంతలు పూడ్చారు..!



సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: వినాయకుడి విగ్రహాలను పోచమ్మ చెరువుకు తీసుకెళ్లే మార్గంలో ఏర్పడిన గుంతలను అధికారులు పూడ్చివేయించారు. ఈ నెల 24న 'సాక్షి' దినపత్రికలో 'వినాయకా.. జెర పైలం' అనే శీర్షికతో రోడ్ల దుస్థితిపై వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఆ వార్తకు సానుకూలంగా స్పందించిన మున్సిపల్ అధికారులు గోల్ బంగ్లా బస్తీ నుంచి పోచమ్మ గడ్డ వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను సిమెంట్, కంకరతో పూడ్చివేయించి రోలర్‌తో చదును చేయించారు. బుధవారం నిమజ్జనం జరగనుండటంతో విగ్రహాలను తీసుకెళ్లే రోడ్డులో గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చేశారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను అధికా రుల దృష్టికి తీసుకెళ్లి పూడ్చివేయడానికి తోడ్పడిన 'సాక్షి' పత్రికను పలువురు అభినందించారు.

### సదుపాయాలు కల్పించాలి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ ఆధ్వర్యంలో డీఈఓ యాదయ్యకు వినతిపత్రం అందించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందడం లేదని, వాష్ బేషిన్స్, టాయిలెట్స్ సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆయన వెంట వెంకటేష్, రంజిత్, రవి, రాజు, మనోహర్ ఉన్నారు.

### సైన్స్‌పై అవగాహన

జైపూర్: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా స్థాయి విజ్ఞాన సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ తెలిపారు. మండలంలోని టేకుమట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు జయశ్రీ, అరుణకుమారి, అపర్ణ, లలిత, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి

చెన్నూర్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీర్ల సుధాకర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఖాలీల్‌ను కార్యదర్శిగా నియమిస్తూ మాజీ ఎమ్మెల్సీ, స్ట్రాటజీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నూకల రమేశ్ పాల్గొన్నారు.

### యూరియా కోసం తరలివచ్చిన రైతులు

తాండూర్: యూరియా కోసం రైతులు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రావడంతో మంగళవారం సంఘ కార్యాలయం కిక్కిరిసింది. వరుసక్రమంలో నిలబెట్టి రైతులకు అధికారులు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. యూరియా కొరత ఉన్నట్లు గ్రామాల్లో ప్రచారం జరగడంతో పత్తి, వరి పంట సాగు చేస్తున్న రైతులు కొనుగోలు కోసం సహకార సంఘంలో ఎగబడ్డారు. ప్రస్తుతం పంటలు చేతి కందే సమయంలో యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

### జయప్రదం చేయండి

జన్నారం: ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చేపట్టే ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్షను విజయవంతం చేయాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జక్కు భూమేశ్, వర్తక సంఘం అధ్యక్షుడు బండారు మారుతిరాజ్ కోరారు. దీక్షలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### రెండో రోజుకు ఆశా వర్కర్ల సమ్మె

లక్సెట్టిపేట: సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

కోటపల్లి: ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సమ్మె నోటీస్‌ను మంగళవారం కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సత్యనారాయణకు అందజేశారు.

మందమర్రిరూరల్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.



# గణపయ్యకు వీడ్కోలు

- సంబురంగా సాగిన నిమజ్జన శోభాయాత్ర
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

చెన్నూర్: మున్సిపాలిటీలో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చెన్నూర్ మున్సిపాలిటీలో నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద చెరువు వద్ద పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా ప్రారంభించారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి గణనాథుల నిమజ్జన శోభాయాత్ర పెద్ద చెరువు వరకు సాగింది. పోతరాజులు, కాళీ మాత ప్రదర్శన, మహిళల కోలాటాలు, యువకులు, చిన్నారుల నృత్యాలతో ఆనందోత్సవాల మధ్య నిమజ్జన వేడుక నిర్వహించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా గాంధీచౌక్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివస్తున్న గణేశ్ మండళ్లకు అధికారులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జైపూర్ ఏసీపీ మోహన్, డీసీపీ రాంనాథ్ కేకన్‌ల ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 10మంది ఎస్సైలు, 80మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలో వినాయకుడి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని రాంపూర్, కొల్లూర్, బోరంపల్లి గ్రామాల్లో మంగళవారం నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున డ్యాన్సులతో బాణాసంచాలను పేల్చుతూ గోదావరి నదిలో నిమజ్జన ఉత్సవాలు నిర్వహించారు.



క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తూ...



వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



శివాలయం గణేశ్ మండలి వినాయకుడు...



బ్రాహ్మణ సంఘం గణేశ్ మండలి వినాయకుడు



మహంకాళివాడ గణేశ్ మండలి వినాయకుడు



గోదావరి రోడ్డు గణేశ్ మండలి గణనాథుడు



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



రాంపూర్‌లో వినాయక నిమజ్జన వేడుకలు

## వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గకేంద్రం బెల్లంపల్లిలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. మున్సిపల్, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బజారు ఏరియా నుంచి ఏఆర్ పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో ఉన్న పోచమ్మ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఏటా మాదిరిగానే వరుస క్రమంలో విగ్రహాలను మధ్యాహ్నం 1గంట నుంచి నిమజ్జనానికి తరలించడానికి పోలీసు అధికారులు వినాయక మండపాల నిర్వాహకులకు సూచించారు. పోచమ్మ చెరువు వద్ద నిమజ్జనానికి కావల్సిన ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు పూర్తి చేశారు. ప్రత్యేకంగా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. పాత సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం క్రాస్‌రోడ్ నుంచి గోల్‌బంగ్లా బస్తీ మీదుగా పోచమ్మ చెరువు వరకు విద్యుత్ స్థంభాలకు కొత్తగా లైట్లను భిగించారు. మరీ ముఖ్యంగా చెరువు వద్ద చీకటి ఉండకుండా అధిక కాంతిని ఇచ్చే హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. మట్టితో కట్టను పటిష్ఠం చేశారు. పిచ్చి మొక్కలు లేకుండా పరిసరాలను పరిశుభ్రం చేయించారు. విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడానికి ప్రత్యేకంగా ఎస్కార్ట్ వాహనాలను తీసుకు రానున్నారు. ముందస్తు జాగ్రత్తగా చెరువు వద్ద గజ ఈతగాళ్లను, పోలీసులను సిద్ధంగా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు.



మట్టితో మరమ్మతు చేసిన రోడ్డు

**వాహనాల రద్దీ ఏర్పడకుండా ...**

విగ్రహాలను నిమజ్జనానికి తరలించడం మధ్యాహ్నం నుంచి మందకొడిగా ప్రారంభమై సాయంత్రం కాగానే మరింత తీవ్రం కానున్నాయి.ఆ సమయంలో వాహనాల రద్దీ ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకున్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడానికి బెల్లంపల్లి ఆర్డీవో శాశబోయిన సురేష్, ఏసీపీ పంతాటి సదయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ సుధాకర్ ఇతర అధికారులు పలుమార్లు పర్యవేక్షణ చేసి సూచనలు, సలహాలు చేశారు. కాగా విగ్రహాల రాకపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉండేలా తగిన చర్యలు తీసుకున్నారు.

### ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ నుంచి గోదావరి నది వరకు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పట్టణ సీఐ రాజు, ట్రాఫిక్ సీఐ నరేష్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. గణేష్ నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్, వినాయక వాహనాలకు అడ్డుగా ఉన్న కరెంట్ లైన్లను, వినాయకుల వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రూట్ మ్యాప్‌లను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పూట తిరుపతి రెడ్డి, తుల అంజనేయులు, రవీందర్, హరికృష్ణ, చారి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పోచమ్మ చెరువు వద్ద గణేశ్‌నిమజ్జనం ఏర్పాట్లను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ఇతర శాఖల అధికారులు పరిశీలించారు. నిమజ్జనానికి ఎలాంటి అంతరాయం కలుగకుండా, భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా సౌకర్యాలు కల్పించి, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిన్నయ్య అధికారులను ఆదేశించారు. వీరి వెంట ఆర్డీఓ కె.సురేష్, ఏసీపీ సదయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎస్‌హెచ్ఓ శంకరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింగం ఉన్నారు.

### వినూత్నంగా అంగన్‌వాడీల నిరసన

జన్నారం/దండేపల్లి/నెన్నెల/తాండూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా 16వ రోజు మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు జన్నారంలో బోనాలు, బతుకమ్మలతో నిరసన తెలిపారు. దండేపల్లిలో రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. నెన్నెలలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తాండూర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రోడ్డుపై నిలబడి వాహనాల రాకపోకలను నిలువరించారు. ఆ తర్వాత మానవహారం చేసి సమస్యలు పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

### అడ్మిషన్లకు ఈ నెల 30 ఆఖరు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 30 చివరి తేదీ అని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బిసగోని శంకర్‌గౌడ్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ చేసుకోని వారుంటే గడువులోగా అడ్మిషన్ పొందాలన్నారు.

### కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

నస్పూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రావణికి సమర్పించారు. కార్యక్రమంలో యాదగిరి, శంకర్‌రావు, అప్పారావు, కిరణ్, ఈశ్వర్‌రావు, తిరుపతి, రాజన్న, సురేష్, శోబ, తదితరులు పాల్గొన్నారు.

### టీబీజీకేఎస్ సంబురాలు

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు 2022–23 ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాల్లో 32శాతం పంపిణీ చేయడానికి ఆదేశాలు రావడంతో ఏరియా టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## మున్సిపల్ సమావేశంలో పది తీర్మానాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం పది అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్ని వార్డుల్లో బతుకమ్మ గ్రౌండ్‌లు ఏర్పాటు చేసేందుకు అద్దెప్రాతిపదికన డోజర్, స్టోన్ డస్ట్ స్ప్రెడింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు రూ.6లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లకు రోడ్ ట్యాక్స్ చెల్లించేందుకు రూ.50వేలు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. నీటి సరఫరా లీకేజీలకు మరమ్మతులు చేసిన ఖర్చు రూ.82వేలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. ట్రేడ్‌లైసెన్స్ నమోదు చేసేందుకు ల్యాప్‌ట్యాప్ కొనుగోలు చేయుటకు రూ.80వేలు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

### నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'

కోటపల్లి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. శంకరాపూర్ గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రాంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 35వాహనాలు సీజ్ చేసినట్లు వివరించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని, యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేశ్, సుబ్బారావు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



గణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే



బెల్లంపల్లి: కమిటీ సభ్యులను సన్మానిస్తూ..



నస్పూర్‌లో కుంకుమ పూజల్లో భక్తులు

### వినాయకుడికి ప్రత్యేక పూజలు

భీమారం/మందమర్రిరూరల్/లక్సెట్టిపేట/బెల్లంపల్లి/దండేపల్లి/మంచిర్యాలఅర్బన్/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణపతికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. లక్సెట్టిపేటలోని నోములవాడలో వినాయక మండపం వద్ద అన్నం, పాలక్‌రైస్, బీట్‌రూట్, క్యారెట్, పుదీనాలతో వినాయకుడు, పార్వతి, పరమేశ్వరుడు, ప్రతిమలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బెల్లంపల్లిలో ముప్పై నాలుగేళ్ల నుంచి బస్తీ మొత్తం ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించి ఐకమత్యం చాటుతున్న శాంతిఖనిబస్తీ వినాయక మండపం నిర్వాహకులను బెల్లంపల్లి పట్టణ హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మండప నిర్వాహకులకు శాలువా కప్పి సన్మానం చేశారు. దండేపల్లిలో కుంకుమ పూజలు నిర్వహించారు. మంచిర్యాలలోని గౌతమినగర్ కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ దర్శించుకున్నారు. అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. గాయత్రి గణేష్ మండలి ఆధ్వర్యంలో కుంకుమపూజలు నిర్వహించారు. మందమర్రిలో వినాయక మండళ్ల నిర్వాహకులను జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. భీమారంలో శ్రీ కృష్ణ యూత్ గణేష్ మండలిలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తాండూర్ మండలం మాదారంలో గణపతి పూజలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.



కేకే-5 గనిపై పూజల్లో అధికారులు, ఉద్యోగులు



లక్సెట్టిపేట: నోముల వాడలో..



భీమారంలో...





జన్నారం: నినాదాలు చేస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో...



సీసీసీ కార్నర్ వద్ద...

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

మంచిర్యాలటౌన్/నెన్నెల/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/చెన్నూర్/నస్పూర్/జన్నారం/పాతమంచిర్యాల/జైపూర్/లక్సెట్టిపేట: జిల్లా వ్యాప్తంగా చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చాకలి ఐలమ్మ సేవలను గుర్తించి అధికారికంగా జయంతి, వర్ధంతి నిర్వహించడం శుభ పరిణామమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో చెన్నూర్ రూరల్ మండలంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, దండేపల్లిలో ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, నస్పూర్‌లో తెలంగాణ రజక రిజర్వేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు సంగెపు ఎల్లయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమురయ్య, ఉపాధ్యక్షుడు కొలిపాక రమేశ్, లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మంచిర్యాలలో తెలంగాణ బీసీ జాగృతి నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్, తెలంగాణ బీసీ జాగృతి పట్టణ వర్కింగ్ ప్రెసిండెంట్ మల్లేష్, ప్రధాన కార్యదర్శి సదానందం, ఉపాధ్యక్షులు సత్తయ్య, పలు సంఘాల, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: నివాళులర్పిస్తున్న రాజన్న

### 'ఇంటి స్థలం ఇవ్వాలి'

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు గుంటల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్ డిమాండ్ చేశారు. ఆర్కే 7గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి ఎన్నికల ముందు కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని, వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ల వద్ద కాంట్రాక్టు ఉద్యోగులను కాకుండా పర్మినెంట్ ఉద్యోగులను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కాదాసి భీమయ్య, పీ వినోద్, గోపు సాయి, రామచందర్, రాయలింగు, రవీందర్ పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిక

శ్రీరాంపూర్: ఆర్కే 6 ఉదయ నగర్‌లో పలువురు యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు హాజరయ్యారు. ఆయన సమక్షంలో సుమారు వందమంది యువకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శి మిట్టపల్లి మొగిలి, నాయకులు బద్రి శ్రీకాంత్, కొండ వెంకటేష్, కుర్ర చక్రి, సిరికొండ రాజు, అంబాలసాగర్ మహేందర్, స్వప్న పాల్గొన్నారు.